క్లుప్తంగా

మాదకద్రవ్యాల నియంత్రణ అందరి బాధ్యత

సిరిసిల్లక్రైం: మాదకద్రవ్యాల నియంత్రణ, వాటివల్ల కలిగే అనర్థాలపై జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మహేశ్ బీ గితే అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిధిలో ప్రతి ఒక్కరి ఆరోగ్యకర జీవితానికి నో స్మోకింగ్, నో డ్రింకింగ్, నో డ్రగ్స్ పేరిట, మద్యపానం వద్దు, మాదక ద్రవ్యాలు వద్దు అనే నినాదంతో విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



మొక్కలు పంపిణీ చేస్తున్న శ్రీకాంత్, తదితరులు

సిరిసిల్లఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడుతాయని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం సిరిసిల్లలోని నేతన్న విగ్రహం వద్ద జన సంఘ వ్యవస్థాపకులు శ్యామప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ నుంచి జన్మదినం వరకు జరుగబోయే కార్యక్రమాల్లో భాగంగా అమ్మ పేరుతో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, పార్లమెంట్ కో కన్వీనర్ ఆడెపు రవీందర్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న ఏపీఎం మల్లేశం

ఎల్లారెడ్డిపేట: మహిళా సంఘాల సభ్యులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం మల్లేశం అన్నారు. మండల కేంద్రంలోని కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం గ్రామ సంఘాల్లో నూతనంగా ఎన్నికైన వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మల్లేశం మాట్లాడుతూ.. గ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారుల విధులు, బాధ్యతల గురించి వివరించారు. వీవోలు పాటించాల్సిన ఆర్థిక లావాదేవీలను జాగ్రత్తగా నిర్వర్తించాలన్నారు. ముఖ్యంగా మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు మౌనిక, కోశాధికారి భార్గవి, సీసీలు మంగ్యానాయక్, దేవేందర్, నాగరాజు, సుధాకర్, రమణ, పద్మ, బి. పద్మ, కె. పద్మ, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల నిలిపివేతతో ఇబ్బంది



మానేరు వాగుకు వెళ్లేదారిలో ట్రాక్టర్లు

బోయినపల్లి: మండలంలోని మాన్వాడలో మానేరు వాగుకు వెళ్లేదారిలో ఇసుక ట్రాక్టర్లు భారీగా నిలిచి ఉండడంతో ఇబ్బంది పడుతున్నట్లు ఆ దారి మీదుగా పొలాలకు వెళ్లే రైతులు, ఇతరులు వాపోతున్నారు. మానేరు వాగు నుంచి వే బిల్లులతో కూడిన ఇసుక తరలిస్తున్నారు. వాగులోకి వెళ్లేందుకు ట్రాక్టర్లు ఇలా రోడ్డు మొత్తం నిండిపోవడంతో ఈ దారి గుండా ఎలా వెళ్లాలో అధికారులు తెలపాలని పలువురు పేర్కొంటున్నారు.

చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు బాలుడి అప్పగింత

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని కిషన్‌దాస్‌పేట ప్రాథమిక పాఠశాల విద్యార్థి తాజొద్దీన్ అదృశ్యం మిస్టరీ వీడింది. సోమవారం పాఠశాలకు వెళ్లిన తాజొద్దీన్ సాయంత్రం ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లి జకీయ చుట్టుపక్కల ఇళ్లల్లో గాలించింది. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉంటున్న తాజొద్దీన్ నాన్నమ్మ అబేదాతో వెళ్లినట్లు గుర్తించారు. పోలీసులు సిద్దిపేటకు మంగళవారం వెళ్లి బాలుడిని ఎల్లారెడ్డిపేటకు తీసుకొచ్చారు. బాలుడిని చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు పోలీసులు అప్పగించారు.

ఆర్థికసాయం చెక్కు అందజేత



వేములవాడరూరల్: వేములవాడ మండలం హన్మాజిపేటలో సోమవారం గొర్రె మైసయ్య ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న విప్ ఆది శ్రీనివాస్ బాధిత కుటంబాన్ని పరామర్శించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఇంట్లో నిత్యావసర వస్తువులు అందించారు. మంగళవారం రూ.60 వేల చెక్కును బాధిత కుటుంబానికి మంగళవారం అందించారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, శ్రీనివాస్, రోమాల ప్రవీణ్, ప్రభాకర్, శంకర్ తదితరులున్నారు.

సిబ్బంది కొరత.. పని ఒత్తిడి

- 10 గ్రామాల్లో హెల్పర్లు లేరు
- లైన్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు కరువు
- ముగ్గురు ఏఈఈలకు ఒక్కరే
- మండలంలో 22,354 విద్యుత్ కనెక్షన్లు



ముస్తాబాద్‌లోని సెస్ కార్యాలయం

ముస్తాబాద్: విద్యుత్ లేనిది ఏపని నడవదు. అత్యవసర విద్యుత్ సేవలకు పూర్తిస్థాయిలో అధికారులు, సిబ్బంది ఉన్నప్పుడే అవాంతరాలకు తావులేకుండా నిరంతర విద్యుత్ అందించవచ్చు. మండలంలో సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్)లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. మండలంలో 22వేల 354 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, ఏళ్ల తరబడి ఖాళీలతో ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై పనిఒత్తిడి పెరుగుతోంది.

'సెస్'లో ఖాళీలివే..

సెస్‌లో ప్రతి గ్రామానికి ఓ విద్యుత్ హెల్పర్ ఉంటారు. గ్రామంలో ఏ విద్యుత్ సమస్య వచ్చినా వారు సేవలందిస్తుంటారు. ముస్తాబాద్ లాంటి పట్టణంలో ముగ్గురు హెల్పర్లకు ఒక్కరే ఉన్నారు. కొండాపూర్, రామలక్ష్మణపల్లె, సేవాలాల్‌తండా, వెంకట్రావుపల్లె, మొర్రాయిపల్లె, చిప్పలపల్లి, రాంరెడ్డిపల్లె, తుర్కపల్లి, గూడూరు గ్రామాల్లో హెల్పర్లు లేరు. పోతుగల్‌లో ఇద్దరికి గాను ఒక్కరే ఉన్నారు. దీంతో సకాలంలో విద్యుత్ సేవలు అందడం లేదనే ఆరోపణలున్నాయి. వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ అందించే ట్రాన్స్‌ఫార్మర్లు అధిక లోడుతో కాలిపోతున్నాయి. ఈ సమయంలో హెల్పర్లు సేవలు అందిస్తుంటారు. చాలాగ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లపై ఫ్యూజ్‌లుపెడుతూ పలువురు మృతిచెందిన సంఘటనలున్నాయి.

మండలంలో విద్యుత్ కనెక్షన్లు ఇలా
వ్యవసాయం : 8,115
గృహ కనెక్షన్లు : 12,468
పరిశ్రమలు : 138
వాణిజ్యం :1305

లైన్‌మెన్లది అదే పరిస్థితి..

ఒక్కో సబ్‌స్టేషన్ పరిధిలో ఓ లైన్‌మెన్ ఉండాలి. మండలంలో పది సబ్‌స్టేషన్లు ఉన్నాయి. బందనకల్, పోతుగల్, గన్నేవారిపల్లె, ఆవునూర్, తెర్లుమద్ది, మోహినికుంట, చిప్పలపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్‌మెన్లు లేరు. ఏదైనా మరమ్మతులు వచ్చినప్పుడు ఎల్‌సీ తీసుకునేది లైన్‌మెన్లే. అలాగే బ్రేక్ డౌన్ అయినప్పుడు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టి, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా పనిచేసేది లైన్‌మెన్లు. రైతులు, రైస్‌మిల్లులు, పౌల్ట్రీలు, దుకాణాల విద్యుత్ వినియోగదారులు దీంతో ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉండగా ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు 22 గ్రామాల్లో సేవలు అందించేందుకు ఒక్కరే ఏఈ ఉన్నారు. ఇక్కడ ముగ్గురు ఏఈలు ఉండాలి. కానీ ఒక్కరే పని చేస్తుండడంతో తీవ్ర పనిఒత్తిడి ఎదుర్కొంటున్నారు. బకాయిల వసూళ్లు, అక్రమ విద్యుత్ వాడకం నిరోధకం, మరమ్మతులు వంటి వాటిని చూసుకోవాల్సి ఉంది.

ఖాళీలు భర్తీచేయాలి



సహకార రంగంలో సెస్ ఎంతో పేరుగాంచింది. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు నియామకాలు చేపట్టాలి. ఫలితంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించి, విద్యుత్ సరఫరాలో నాణ్యత పెరుగుతుంది.

– గోపి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు

పని ఒత్తిడి ఉన్నా..



సెస్‌లో ఖాళీలతో పని ఒత్తిడి ఉన్నా వాటిని అధిగమించి పనిచేస్తున్నాం. గ్రామాల్లో హెల్పర్లు, లైన్‌మెన్ల ఖాళీలపై అధికారులకు నివేదించాం. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తాం.

– విష్ణుతేజ, ఏఈ

పాలకవర్గంలో చర్చిస్తాం



సెస్‌లో ఖాళీల విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరోసారి పాలకవర్గంలో ఖాళీల భర్తీపై చర్చిస్తాం. రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు.

– సందుపట్ల అంజిరెడ్డి, సెస్ డైరెక్టర్

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



చందుర్తి : పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, విద్యార్థులు



ఎల్లారెడ్డిపేట : మాట్లాడుతున్న ఎస్సై రమాకాంత్

చందుర్తి: యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం విద్యార్థుల అలవాట్లను, నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలని కోరారు. మాదక ద్రవ్యాలతో జీవితాలతో నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం వాల్ పోస్టర్ ఆవిష్కరించి, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఎస్సై రమేశ్, కళాశాల బోధన సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: యువత గంజాయి, గుడుంబా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్సై రమాకాంత్ అన్నారు. ఎల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ×నషా ముక్త్ భారత్ అభియాన్×లో భాగంగా మత్తు పదార్థాలపై పోలీసులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మనోహరచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోయినపల్లి: డ్రగ్స్ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలని ఎస్సై రాజ్‌కుమార్ పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా కొదురుపాక, నర్సింగాపూర్ హై స్కూళ్లలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నర్సింగాపూర్ హైస్కూల్‌లో పదిలో వందశాతం ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను చంద్ర ఎడ్యుకేషన్ సొసైటీ సీ. రామరాజు ఆధ్వర్యంలో ఎస్సై రాజ్‌కుమార్ సన్మానించారు. ఎంఈవో ఎన్. శ్రవణ్‌కుమార్, ద్యావనపెల్లి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మాదక ద్రవ్యాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై కే. ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ... యువకులు డ్రగ్స్‌కు బానిసలు కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంచ శివకుమార్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఎల్లయ్య గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని పలుకూడళ్లలో పోస్టర్లను ప్రదర్శించారు.

ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలి



సిరిసిల్ల అర్బన్ : కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులతో పాటు, బుక్స్, యూనిఫామ్స్ అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులపై పెనుభారం మోపుతున్నారని, ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్‌కుమార్ మంగళవారం డీఈవో వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ విక్రయిస్తున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్, జిల్లా నాయకులు సోల్లు సాయి, తదితరులున్నారు.

ఎలా బతకాలి..



కూల్చిన ఇంటి వద్ద దీనంగా కూర్చున్న మల్లమ్మ

వేములవాడరూరల్: ఈమె పేరు రేగుల మల్లమ్మ. కూల్చిన తన ఇంటి వద్ద దీనంగా కూర్చున్నది. ఆమె ముందు ఒక చిన్న చాయి బండి. ఆ బండితోనే తన బతుకు కొనసాగిందని ఇప్పుడు ఎలా బతికేది అని ఆవేదన వ్యక్తం చేసింది. వేములవాడ పట్టణంలోని రోడ్ల వెడల్పులో భాగంగా మల్లమ్మ ఇల్లు కూడా పోయింది. దాదాపు 50 ఏళ్లుగా హోటల్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆమె.. ప్రస్తుతం కొడుకు, కోడలు, ఇద్దరు మనుమల కోసం ఇంకా అదే పనిలో కొనసాగుతోంది.

కేసీఆర్, కేటీఆర్‌పై వ్యాఖ్యలు మానుకోవాలి



మాట్లాడుతున్న కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల అర్బన్ : మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ను విమర్శించే స్థాయి ఎంపీ అరవింద్‌కు లేదని, వారిపై అనుచిత వాఖ్యలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు ముద్దం అనిల్‌గౌడ్, కాసర్ల శ్రీనివాస్, ఎస్.కే ఫిరోజ్‌ఖాన్, వడ్లూరి సాయి, కిరణ్, ఎండి అజ్జు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● బెస్ట్ అవెలబుల్ స్కూల్స్‌లో గిరిజన విద్యార్థులకు అన్యాయం

సిరిసిల్లటౌన్: బెస్ట్ అవెలబుల్ స్కూల్స్‌లో జిల్లా గిరిజన విద్యార్థులకు కేవలం ఐదుసీట్లు మాత్రమే కేటాయించి అన్యాయం చేశారని లంబాడీల ఐక్య వేదిక స్టేట్ ఇన్చార్జి బాణోత్ నరేశ్‌నాయక్ అన్నారు. మంగళవారం సిరిసిల్లలో మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికార సంస్థ తీసుకున్న నిర్ణయంతో గిరిజన విద్యార్థులకు కేటాయించే సీట్లు గణనీయంగా తగ్గించబడ్డాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సీట్ల తగ్గింపును రద్దు చేసి, గత సంవత్సరాల్లో ఉన్న స్థాయిలో సీట్లను కొనసాగించాలని కోరారు. లైవ్ టౌన్ ఇన్చార్జి శ్రీనివాస్, తిరుపతి, ప్రకాష్, రాజ్ తదితరులు పాల్గొన్నారు.

● సీఎం వీడియో కాన్ఫరెన్స్ తిలకించిన రైతులు

సిరిసిల్ల అర్బన్/వీర్నపల్లి: ప్రభుత్వం రైతుభరోసా నిధులు విడుదల చేసిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి రైతులను ఉద్దేశించి సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని చంద్రంపేట రైతు వేదిక, ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు, కాంగ్రెస్ నాయకులు తిలకించారు. వీర్నపల్లి మండలకేంద్రం, ఇల్లంతకుంట మండలంలోని రేపాక, వల్లంపట్ల, ఇల్లంతకుంట, గ్రామాల్లోని రైతు వేదికల్లో రైతులతో ముఖాముఖి కార్యక్రమంనిర్వహించారు.

● విద్యుదాఘాతంతో గేదె మృతి

ఇల్లంతకుంట: విద్యుత్‌షాక్‌తో పాడిగేదె మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ..మండలంలోని వెల్జీపూర్‌కు చెందిన చుక్క కనకయ్య అనే కౌలు రైతు పాడి గేదెను నీరు పెట్టేందుకు తీసుకెళ్లగా విద్యుత్ స్తంభానికి ఉన్న న్యూట్రల్ వైరు తగిలి గేదె మృతిచెందింది. విద్యుత్ వైరు తెగిపడి మూడు రోజులవుతుందని, అధికారుల నిర్లక్ష్యం వల్లే గేదె మృతిచెందిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై ఇల్లంతకుంట సెస్ ఏఈ నగేశ్‌కుమార్‌ను వివరణ కోరగా న్యూట్రల్ వైర్ తెగిపడి మెయిన్ వైర్‌కు తగలడంతో గేదె మృతి చెందినట్లు తెలిపారు.

● దరఖాస్తుల ఆహ్వానం

కోనరావుపేట: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అంచ శివకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తిగల విద్యార్థులు సర్టిఫికెట్లతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జూలై 1 లోపు తమ దరఖాస్తులను అందించాలని కోరారు.

● విద్యార్థులు చదువులో రాణించాలి

సిరిసిల్ల అర్బన్ : విద్యార్థులు క్రమశిక్షణతో పాటు, చదువులో రాణించాలని మండల విద్యాధికారి దూస రఘుపతి అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని జగ్గారావుపల్లెకు చెందిన లింగంపల్లి అక్షయ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆయన జ్ఞాపకార్థం విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు సమకూర్చారు. గ్రామస్తులు తదితరులున్నారు.

● ఎంపీడీవోకు సన్మానం

చందుర్తి : చందుర్తి ఎంపీడీవోగా ఎల్. రాధ సోమవారం బాధ్యతలు చేపట్టగా మండల పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో బండి ప్రదీప్‌కుమార్, మండల పరిషత్ జూనియర్ అసిస్టెంట్ రమాదేవి, పంచాయతీరాజ్ శాఖ ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు కవిత, కళాజ్యోతి, అనిల్, రమేశ్ బాబు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● హామీలు అమలుచేయాలి

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ ఇచ్చిన హామీలు వెంటనే అమలుచేయాలని జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కోఆర్డినేటర్ వెంగళ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు మంగళవారం వినతిపత్రం అందించారు. ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమకారులను గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాస పథకంలో 20% శాతం తెలంగాణ ఉద్యమకారులకు కేటాయించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధకులుగా గౌరవించి నెలకు 25 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు.

● ప్రజావాణిలో రశీదులు ఇవ్వడం లేదు

తంగళ్లపల్లి: కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించి రశీదులు ఇవ్వడం లేదని అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ముచ్చంతుల గోపాల్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజావాణిలో రశీదు ఇవ్వాలని అధికారులను కోరితే సర్వర్ సమస్య ఉందని సాకులు చెబుతూ ఇవ్వడం లేదన్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.



తంగళ్లపల్లి : మండలంలోని మండెపల్లి శివారులోని ఎల్లమ్మ ఆలయానికి వెళ్లేందుకు భక్తులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు లేకపోవడంతో సీసీ రోడ్డుపైనే మురుగునీరు చేరుతోంది. అధికారులు స్పందించి మురుగు కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
మీర్జా అఫ్జల్ అహ్మద్ బేగ్ ఎంపీవో, సెల్: 9490083683

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

రైతు భరోసా సంబరాలు



సిరిసిల్ల టౌన్: సిరిసిల్లలో సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

సిరిసిల్ల టౌన్ / గంభీరావుపేట/చందుర్తి/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/తంగళ్లపల్లి/ఇల్లంతకుంట : సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని అన్ని మండలకేంద్రాల్లో మంగళవారం కాంగ్రెస్ నాయకులు రైతు భరోసాపై సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందించి అండగా నిలుస్తోందని తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌక్‌లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. గంభీరావుపేట మండలంలోని గోరంటాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి రైతులకు స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు. చందుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి ఆధ్వర్యంలో, ముస్తాబాద్ మండలంలోని ముస్తాబాద్, బందనకల్, నామాపూర్ రైతువేదికల్లో రైతు భరోసా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి తదితరులున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్స య్య నాయకులు పాల్గొన్నారు. ఇల్లంతకుంట మండలకేంద్రంలో నిర్వహించిన సంబరాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, తంగళ్లపల్లి మండలకేంద్రంలోని మండెపల్లి చౌరస్తాలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆధ్వర్యంలో రైతుభరోసా సంబరాలు నిర్వహించారు.

'కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు'



మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులనే గెలిపించాలని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతుల పేరిట, కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుతున్నారని ఆయన విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు రాని పేదల పక్షాన నియోజకవర్గకేంద్రంలో ఈనెల 26న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట ఏర్పాటుచేసిన కమిటీలో కాంగ్రెస్ కార్యకర్తలను నియమించి వారికి మాత్రమే ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో గ్రామసభలు నిర్వహించి నిరుపేదలకు డబుల్ బెడ్ రూములు కేటాయించామన్నారు. మాజీ జెడ్పీటీసీ సిద్ధం వేణు, పార్టీ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ గొడుగు తిరుపతి, నాయకులు చెరకు రాజిరెడ్డి, బిల్లవేని పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ధరలకు కళ్లెం..!

సాక్షి స్పందన

బోయినపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక సరఫరా చేసే వాహనదారులు భారీ రేట్లకు ఇసుక సరఫరా చేస్తుండడంతో ఈనెల 21న సాక్షిలో యథేచ్ఛగా ఇసుక రవాణ అనే శీర్షికన వచ్చిన కథనానికి ఎంపీడీవో బీమ జయశీల స్పందించారు. ఈ మేరకు మాన్వాడ నుంచి ఇసుక సరఫరా చేసే వాహనదారులతో మంగళవారం సమావేశమై ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు మార్కెట్ ధర కంటే కొంత మేర తగ్గించి ఇసుకను విక్రయించాలని తీర్మానించినట్లు తెలిపారు. మాన్వాడకు దూరంగా ఉన్న మల్కాపూర్, అనంతపల్లి, కోరెం, దుండ్రపల్లి గ్రామాలకు ట్రిప్ ఒక్కంటికి రూ.3 వేలు, మాన్వాడకు దగ్గరగా ఉన్న వెంకట్రావుపల్లి, కొత్తపేట, మల్లాపూర్ మాన్వాడ గ్రామాలకు స్థానికంగా నిర్ణయించిన ధర మిగిలిన (15) గ్రామ పంచాయతీల లబ్ధిదారులకు ట్రిప్ ఒక్కంటికి రూ. 2వేల చొప్పున ఇసుక విక్రయించాలని తీర్మానించినట్లు చెప్పారు. అధిక ధరలకు విక్రయించిన ట్రాక్టర్ యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం

బోయినపల్లి: ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని బోయినపల్లి ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత యాసంగి సీజన్‌లో మండలంలో సాఫీగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం సహకారంతో మార్కెట్‌యార్డులో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వైస్ చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, కార్యదర్శి పీ.రమణ, డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్, హరికృష్ణ, ఎండీ. బాబు, మహేశ్, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

● నాణ్యమైన విద్య అందిస్తున్నాం

ముస్తాబాద్: ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సునీత అన్నారు. కళాశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌ను మంగళవారం పంపిణీ చేశారు. అధ్యా పకులు, తదితరులున్నారు.